www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 1 డిసెంబర్ 2024



కమ్ముకున్న ముసురు

- జిల్లాపై 'ఫెంగల్' ప్రభావం
- తుపాన్‌తో పెరిగిన చలి
- వణుకుతున్న జనం
- పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు
- నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు, చెట్లు





మొరవ పాతురుతన్న పాతార్కాడు చెరువు, ఈదురు గాలులకు కూలిన చెట్లు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఎడతెరిపి లేని వర్షంతో జిల్లా చిగురుటాకులా వణుకుతోంది.. ఈదురుగాలులతో కూడిన వానతో వాతావరణం ఒక్కసారి చల్లబడి ఇంట్లోఉన్నా చలికి వణికిపోవాల్సి వస్తోంది. వృద్ధులు, చిన్న పిల్లలు చలికి తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. తుపాను ప్రభావంతో శనివారం ఉదయం నుండీ జిల్లా వ్యాప్తంగా ఓ మోస్తారు నుంచి భారీ వర్షం కురిసింది. మరో రెండు రోజులపాటు రాయలసీమ జిల్లాలో ఈదురుగాలులతో కూడుకున్న వర్షం కురిసే అవకాశముందన్న వాతావరణ హెచ్చరికలతో ఆర్‌డిఒలు, తహశీల్దార్లు, ఎంపిడిఒలతో పాటు ఇరిగేషన్, ఉద్యానవన, వ్యవసాయశాఖలతో పాటు రెవెన్యూ యంత్రాగాన్ని కలెక్టర్ అప్రమత్తం చేశారు. ప్రాజెక్టులు, రిజర్వాయర్ల వద్ద నిఘా ఉంచి ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కోవాలని సూచించారు. ఇసుకు బస్తాలను సిద్ధం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశాలు జారీ చేశారు. ఉద్యానవన పంటలకు నష్టం వాటిల్లకుండా ముందుస్తు జాత్రలు తీసుకొనేలా రైతులను అప్రమత్తం చేస్తున్నారు. నైరుతి బంగాళాఖాతం మీదుగా ఫెంగల్ తుపాను కారణంగా శని, ఆది, సోమవారాల్లో జిల్లాలో భారీ వర్ష సూచనల మేరకు శనివారం టెలీకాన్ఫెరెన్స్ నిర్వహించి ప్రాణ, ఆస్తి నష్టం చోటు చేసుకోకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా అధికారులు, నియోజవర్గ, మండల, సచివాలయ సిబ్బంది కార్యాలయాల్లో అందుబాటులో ఉంటూ క్షేత్రస్థాయి సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పశు సంవర్ధశాఖ పాడిరైతులకు అందుబాటులో ఉంటూ పాడిసంరక్షణ, అంతరాయం లేకుండా విద్యుత్ అధికారులు, అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకొని వైద్యఆరోగ్యశాఖ ఏరియా ఆసుపత్రులు, పిహెచ్‌సీలలో వైద్యులు అందుబాటులో ఉండాలని, పూరిగుడిసెలు, శిథిలావస్థలో ఉన్న ఇండ్లను గుర్తించి అక్కడి వారిని పునరావాస కేంద్రాలకు తరలించేలా ప్రభుత్వ పాఠశాలల్లో పునరావాస కేంద్రాలు గుర్తించాలని, జిల్లాలో మండలాల్లో కల్వర్టులు, బ్రిడ్జిలు, కాజ్‌వేల వద్ద అప్రమత్తంగా ఉంటూ ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా రెవెన్యూ, మండల అభివృద్ధి సిబ్బంది ప్రజలకు సూచనలు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

కంట్రోల్ రూం ఏర్పాటు..

నైరుతి బంగాళాఖాతం మీదుగా ఫెంగల్ తుపాను ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న వర్షాల కారణంగా ప్రాణ, ఆస్తి నష్టం చోటు చేసుకోకుండా సమన్వయం కోసం జిల్లా కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. 94910 77356, ల్యాండ్ నెంబర్ 08572-242777 భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా కేంద్రంలో కంట్రోల్ రూమ్ 24 గంటలు పని చేయనుంది. అలాగే చిత్తూరు ఆర్‌డిఒ కార్యాలయం కంట్రోల్ రూం 94910 77011, కుప్పం కంట్రోల్ రూం 99660 72234, పలమనేరు కంట్రోల్ రూం 94910 74510, నగరి ఆర్‌డిఒ కార్యాలయం కంట్రోల్ రూం 9652138325 ఏర్పాటు చేశారు.

విజయపురం: తుపాన్ ప్రభావంతో శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. జిల్లాలో అత్యధికంగా 89.2 మిల్లీమీటర్లు వర్షపాతం నియోజకవర్గంలో నమోదు అయ్యింది. పలు ప్రాంతాల్లో చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ఫ్లెక్సీలు రోడ్లపై పడ్డాయి ఈ సమయానికి రోడ్డుపై ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పఇంది. లోతట్టు ప్రాంతాలు జలమయ్యాయి. పలు ప్రాంతాల్లో పొలాలపై వర్షపు నీరు నిలిచింది. చిత్తూరు- తచ్చూరు హైవేలో నెంబరు 66 వద్ద పొలాల పక్కనే రివిట్‌మెంట్ వాల్ కట్టేయడం చెరువుకు నీరు పోయే కాలువను మూసుకుపోవడంతో చెరువుకు వెళ్లాల్సిన నీరు పంటపొలాలపై ప్రవహించింది. నాలుగురోజులు ముందువేసిన చెరుకు పంట పూర్తిగా నీటమునిగింది. రూ.35 వేలు నష్టపోయినట్లు రైతు మునస్వామిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. గుండ్రాజుకుప్పం వద్ద విద్యుత్ స్తంభం నేలకొరగడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. వర్షంతో పాటు వాతావరణంలో చల్లదనం ఎక్కువగా చోటుచేసుకోవడంతో జనజీవనం స్తంభించింది. గాలులకు గొడుగులు కూడా ఎత్తుకువెళ్లలేని పరిస్థితి నెలకొనడంతో జనం ఇళ్లకే పరిమితమైంది. నీటి పారుదల కాలువల్లో నీరు పెద్ద ఎత్తున ప్రవహించింది. తుపాన్ నేపథ్యంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు ఆర్డీవో వై.భవానిశంకరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కంట్రోల్ రూమ్ నుంచి పూర్తి స్థాయిలో పర్యవేక్షణ చేపడుతామన్నారు. ఆదివారం డీటీ కేఈ గౌరీశంకర్, నింద్ర వీఆర్‌ఏ భూపాల్ కంట్రోల్ రూమ్‌లో ఉంటారని 9491803680 నెంబరుకు సంప్రదించవచ్చన్నారు.



పడిపోయిన బోర్డులు..

వెదురుకుప్పం: తుపాన్ ప్రభావం ముసురు వానలతో జనజీవనం స్తంభించిపోయింది. తప్పనిసరి పరిస్థితుల్లో తప్ప ఇంటి నుంచి బయటకు రాని పరిస్థితి నెలకొంది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని వాగులు, వంకలు పొంగిపొర్లు తున్నాయి. అయితే ఇంకా చెరువుల్లోకి నీరు చేరలేదు. ఈ వర్షంతో అయినా చెరువులు పూర్తి స్థాయిలో నిండుతాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

రొంపిచర్ల: తుపాన్ ప్రభావంతో రొంపిచర్ల మండలం అంతటా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. శనివారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం పడుతూనే ఉంది. తుపాను ప్రభావంతో చలి తీవ్రత పెరగడం వల్ల ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రాలేకపోయారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. ఎలాంటి సమస్యలు ఉన్న కంట్రోల్ రూమ్ సంప్రదించాలని కోరారు. ప్రజల ప్రముక్తంగా ఉండాలని తహశీల్దార్ కిరణ్ కుమార్ తెలియజేశారు.

సదుం : తుపాన్ వలన కురుస్తున్న వర్షాలకు మండల పరిధిలోని ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. గార్గేయ నది ప్రవాహం పెరిగే పరిస్థితి ఉంది. నదికి అనుసంధానగా ఉన్న సీతమ్మ చెరువుకు, తాటి గుంటపాలెం పెద్దచెరువుకు వర్షపు నీరు భారీగా చేరే అవకాశం ఉంది. గత వారం తాటిగుంటపాలెం పెద్ద చెరువుకు గండి పడిన విషయం తెలిసిందే.. అప్పుడు తాత్కాలిక చర్యగా గండిపూడ్చారు. అయితే ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు మళ్లీ గడిపడే అవకాశం ఉండటంతో ముందస్తు చర్యలు చేపట్టినల్లు తహసీల్దార్ మారూఫ్ హుస్సేన్ తెలిపారు. అలాగే కంట్రోల్ రూమ్ 80741 72985 ఏర్పాటు తెలిపారు.

సోమల: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రైతులు జాగ్రత్తలు పాటించి పంటలను కాపాడుకోవాలని వ్యవసాయాధికారి వై.సుధాకర్ తెలిపారు. పంటలు ఉన్న పొలాల్లో వీలైనంత త్వరగా ఈ వర్షాలకు పడే వర్షం నీటిని బయటకు పంపే విధంగా ముందస్తుగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. అలాగే కోత కోసిన వరి ధాన్యం లేదా కోతకోసిన వరి పంట పొలంలోనే ఉంటే వెంటనే సురక్షిత ప్రదేశానికి తరలించి ధాన్యాన్ని భద్రపరచుకోవాలని సూచించారు. రాబోవు రెండు రోజులు వరి పంట కోతలు చేపట్టకూడదని, కోతకోసి నూర్పిడి చేసిన ధాన్యాన్ని కూడా వర్షాలకు తడవకుండా ఉండే సురక్షిత ప్రదేశంలో భద్రపరుచుకోవాలని తెలిపారు.



మునిగిన చెరకు పంట

వర్షపాతం వివరాలు ఇలా..

తుపాను ప్రభావంతో జిల్లాలో మండలాల వారీగా నమోదైన వర్షపాతాలు ఇలా ఉన్నాయి నగిరి అత్యధికంగా 89.2 మిల్లీమీటర్లు, అత్యల్పంగా రామకుప్పం మండలం 1.0 మిల్లీమీటర్లు. ఇక ఇతర మండలాలు వర్షపాత వివరాలు ఇలా ఉన్నాయి. నింద్ర 77, కార్వేటి నగరం 62.4, రొంపిచర్ల 36.8, పాలసముద్రం 40.4, ఎస్‌ఆర్ పురం 33.6, పులిచర్ల 32.2, విజయపురం 60.2, సదుం 24.4, సోమల 24.4, బంగారుపాల్యం 23.4, గంగవరం 17.8, ఐరాల 27.4, పలమనేరు 17.2, తవణంపల్లి 24.8, బైరెడ్డిపల్లి 14.8, పుంగనూరు 42.4, పూతలపట్టు 22.6, చిత్తూరు రూరల్ 18.4, వీకోట 12.0, చౌడేపల్లి 11.4, గుడిపల్లి 21.6, వెదురుకుప్పం 24.8, పెద్దపంజాణి 10.2, యాదమరి 21.0, శాంతిపురం 9.6, పుంగనూరు 9.6, చిత్తూరు అర్బన్ 17.0, జీడీ నెల్లూరు 17.2, కుప్పం 5.4, గుడిపల్లి 2.2, రామకుప్పం 1.0గా నమోదైంది.

క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండండి..

లోతట్టు ప్రాంతాలను పరిశీలించిన కమిషనర్

నగరపాలక పరిధిలోని అన్ని శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని కమిషనర్ పి.నరసింహ ప్రసాద్ ఆదేశించారు. శనివారం ఉదయం నుంచి కురుస్తున్న వర్షాలతో నగరంలోని లోతట్టు ప్రాంతాల పరిస్థితిని కమిషనర్ పరిశీలించారు. నీవానది పరివాహక ప్రాంతాలైన వీరభద్ర కాలనీ, తెనబండ, కైలాసపురం ప్రాంతాల్లో పర్యటించి పరిస్థితిని సమీక్షించారు. వర్షాల నేపథ్యంలో చేపట్టాల్సిన చర్యలపై ఇంజనీరింగ్, ప్రజారోగ్య శాఖ అధికారులకు మార్గనిర్దేశం చేశారు. లోతట్టు ప్రాంతాల్లో, నీవా నది పరివాహక ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించి ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. వర్షపు నీరు ఎక్కడా నిల్వచేరకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మేజర్, మైనర్ డ్రైన్లలో అడ్డంకులు లేకుండా చూడాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో వేగంగా స్పందించేందుకు వీలుగా రెస్క్యూ బృందాలను ఏర్పాటు చేశారు. నగరపాలక కార్యాలయంలో 24 గంటల పనిచేసేలా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. వర్షాలతో ఏమైనా అత్యవసర పరిస్థితుల తలెత్తినప్పుడు ప్రజలు కంట్రోల్ రూమ్ నెంబర్ 98499 07885 సమాచారం ఇవ్వాలన్నారు. కమిషనర్ వెంట డీఈలు వెంకట రమణ, శ్రావణి, ఎఈలు ఉన్నారు.



నీవానదిని పరిశీలిస్తున్న నగర కమిషనర్ నరసింహ ప్రసాద్

కేసులను త్వరితగతిన పూర్తిచేయాలి

నేర సమీక్షలో ఎస్పీ మణికంఠ చందోలు



ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: పోలీసింగ్ స్కిల్స్, విజిబుల్ పోలీసింగ్ పెంచే విధంగా పనిచేయాలని, ప్రజలతో సామరస్యంగా, సఖ్యతతో చట్టంపై గౌరవం పెంపొందేటట్లు మెలగాలని, ఎర్రచందనం, నాటుసారా, ఇసుక అక్రమ రవాణ నేరస్తులపై ఉక్కుపాదం మోపి, పిడి యాక్ట్‌లు ప్రయోగించాలని ఎస్పీ మణికంఠ చందోలు తెలిపారు. పెండింగ్ కేసులపై ప్రత్యేకశ్రద్ధ వహించి త్వరితగతిన పరిష్కరించాలని నెలవారి నేరసమీక్ష శనివారం జూమ్ కాన్ఫరెన్స్‌లో జిల్లా ఎస్పీ పోలీసుల అధికారులను ఆదేశించారు. ప్రతిగ్రామంలో పాత నేరస్తుల కదలికలపై నిఘా పెంచాలని, రోడ్డు ప్రమాదాలు మరింత తగ్గే విధంగా నివారణకు మెరుగైన చర్యలు చేపట్టాలన్నారు. అలాగే గంజాయి అక్రమ రవాణా, విక్రయాలపై ప్రత్యేక నిఘాపెట్టి కఠినచర్యలు తీసుకోవాలని, మాదకద్రవ్యాలు వల్ల కలిగే దుష్ప్రభావాలు, చట్టపరమైన చర్యల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని, మహిళా పోలీసులచే మహిళలకు, విద్యార్థినులకు సమాజంలో జరిగే నేరాలపట్ల, సైబర్ క్రైమ్‌పై అవగాహన సదస్సులు నిర్వహించి వారిని చైతన్య పరచాలి, బీట్ వ్యవస్థ శాంతి భద్రతల పరిరక్షణ చేస్తూ, నేర నివారణ చేయాలన్నారు. పగలు, రాత్రి బీట్ సిస్టంను మరింత బలోపేతం చేయాలన్నారు. ఈ క్రైమ్ మీటింగ్‌కు జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలోని సబ్ డివిజన్ డీఎస్పీ లు, సర్కిల్ ఇన్స్పెక్టర్‌లు, ఎస్ఐలు పాల్గొన్నారు.

పక్కాగా విద్యార్థులకు స్క్రీనింగ్ పరీక్షలు

కమిషనర్ పి.నరసింహ ప్రసాద్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్ : నగరపాలక పరిధిలోని అన్ని అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో విద్యార్థులకు ఆర్బీఎస్కే స్క్రీనింగ్ పరీక్షలు పక్కాగా చేపట్టాలని కమిషనర్ పి.నరసింహ ప్రసాద్ చెప్పారు. శనివారం నగరపాలక పరిధిలోని శరవణపురం అంగన్వాడీ కేంద్రంలో జరుగుతున్న ఆర్‌బిఎస్‌కె స్క్రీనింగ్ పరీక్షలను కమిషనర్ పి.నరసింహ ప్రసాద్, ఎంహెచ్‌ఓ డాక్టర్ లోకేష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా అంగన్వాడీ కేంద్రంలో విద్యార్థుల ఆరోగ్యానికి సంబంధించిన స్క్రీనింగ్ పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలించారు. నగరపాలక సంస్థ పరిధిలో అన్ని అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లోని ప్రతి విద్యార్థికి స్క్రీనింగ్ పరీక్షలు చేయాలన్నారు. డిఫెక్ట్స్ ఆఫ్ బర్త్, డిసీజెస్, డెఫిషియన్సీ, డెవలప్మెంట్ డిలేస్ అంశాలను జాగ్రత్తగా నమోదు చేయాలన్నారు. పిల్లలు, విద్యార్థుల ఆరోగ్య స్క్రీనింగ్ పరీక్షల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్లైన్లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం, ఐసిడిఎస్ అధికారులు పాల్గొన్నారు.



స్క్రీనింగ్ పరీక్షలను తనిఖీ చేస్తున్న నగర కమిషనర్

మహిళా సంఘాలు ఆర్థికంగా ఎదగాలి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

స్వయం సహాయక మహిళా సంఘాలు ఆర్థికంగా ఎదగాలని మేయర్ ఎస్.అముద చెప్పారు. చిత్తూరు నగరపాలక సంస్థ, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) సంయుక్త ఆధ్వర్యంలో గిరింపేటలో ఏర్పాటు చేసిన మెప్మా అర్బన్ మార్కెట్‌ను శనివారం మేయర్ అముద ప్రారంభించారు. కార్యక్రమంలో కమిషనర్ పి.నరసింహ ప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ బిఎన్ రాజహసింహులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ మహిళా సంఘాలు సమన్వయంతో, ఐక్యంగా పనిచేసే వ్యాపారాలను విజయవంతంగా నిర్వహించాలన్నారు. డ్వాక్రా సంఘాలు బలోపేతం చేయడానికి ప్రభుత్వం అందించే సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని, సంఘాలతో పాటు మహిళా సభ్యులు ఆర్థికంగా పురోగతి సాధించాలన్నారు. అర్బన్ మార్కెట్లో మహిళా సంఘాలు ఏర్పాటుచేసిన వివిధ రకాలైన స్టాల్స్‌ను తిలకించారు. 40కు పైగా స్టాల్స్‌లో న్యూట్రిషన్ ఫుడ్, వివిధ రకాల పేపర్ గ్లాసులు, ప్లేట్లు, వన్ గ్రామ్ గోల్డ్ ఆభరణాలు, డిజైనర్ దుస్తులు, అలంకరణ వస్తువులు, చేతితో తయారుచేసిన వివిధ రకాల వస్తువులు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సీఎంఎం రమణ, సీవోలు, ఆర్పీలు, పలువురు పార్టీ నాయకులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



మెప్మా ఆధ్వర్యంలో స్టాల్స్‌ను ప్రారంభిస్తున్న నగర మేయర్ అముద

టూరిజం హబ్‌కు సహకరించండి..

కేంద్ర పర్యాటక మంత్రికి ఎంపి విజ్ఞప్తి



కేంద్ర పర్యాటక మంత్రిలో చర్చిస్తున్న టిడిపి ఎంపిల బృందం

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు పార్లమెంటును టూరిజం హబ్‌గా తీర్చిదిద్దేందుకు సహకరించాలని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌కి చిత్తూరు చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు విజ్ఞప్తి చేశారు. విజయనగరం రెండవ రాజధానిగా కీర్తి గడించిన చంద్రగిరి కోటను పరిరక్షించి, ఆధునిక యుగానికి అనుగుణంగా తీర్చిదిద్దాలని ఆయన కోరారు. ఢిల్లీ పార్లమెంటు సమావేశాలకు హాజరైన కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు, టిడిపి ఎంపీల బృందం, కేంద్ర పర్యాటకశాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఆంధ్రప్రదేశ్‌లోని గండికోట, రాజమండ్రిలోని హేవలాక్ వంతెన, పుష్కర ఘాట్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నిధులు కెటాయించిన నేపథ్యంలో కేంద్ర పర్యాటక మంత్రికి పుష్ప గుచ్ఛం అందించి, కృతజ్ఞతలు తెలియజేశారు.

8న క్రీడాజ్ఞాన పరీక్ష

ప్రజాశక్తి - చిత్తూరుఅర్బన్ : క్రీడ భారతి వారు ఆన్లైన్‌లో క్రీడా జ్ఞాన పరీక్షలు నిర్వహిస్తుందని వైస్ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ విజయవాడ వారు ఆదేశాల మేరకు క్రీడా భారతి నాల్గవ ఆన్లైన్ క్రీడాజ్ఞాన పరీక్ష డిసెంబర్ 8వ తేదీన ఉదయం 5 నుంచి సాయంత్రం 5 గంటల మధ్య నిర్వహిస్తారని జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి బాలాజి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈపరీక్షలో 50 ప్రశ్నలు ఉంటాయని, అందుకు గాను 25 నిముషాలు సమయం ఉంటుందన్నారు. 12 ఏళ్ల వయస్సు అందరు అర్హులని, ఈ పరీక్షను ఆన్లైన్‌లో కంప్యూటర్, ల్యాప్టాప్, టాబ్లెట్, మొబైల్ ద్వారా పూర్తిచేయాల్సి ఉంటుందన్నారు. చిత్తూరు జిల్లా నుండి ఆసక్తి గల క్రీడాకారులు, విద్యార్థులు, తల్లిదండ్రులు సీనియర్ సిటిజన్లు నుండి ఆన్లైన్ రిజిస్ట్రేషన్లను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు.

హెచ్‌ఐవి లేని సమాజ స్థాపనే లక్ష్యం

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

హెచ్‌ఐవికి కచ్చితమైన మందు లేదు.. నివారణ ఒక్కటే మార్గమని, 2030 నాటికి హెచ్‌ఐవి లేని సమాజ స్థాపనే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని డిఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ ప్రభావతి దేవి పేర్కొన్నారు. శనివారం జిల్లా సచివాలయంలోని సమావేశపు మందిరంలో సంబంధిత శాఖల అధికారులతో హెచ్‌ఐవి, ఎయిడ్స్ పై కన్వర్షన్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎం హెచ్‌ఓ మాట్లాడుతూ ప్రజలు హెచ్‌ఐవి, ఎయిడ్స్ పై అప్రమత్తంగా ఉండాలన్నారు. హెచ్‌ఐవి పాజిటివ్ ఉన్న వ్యక్తులు ఏఆర్‌టి సెంటర్ల ద్వారా ఉచిత మందులతో ఆరోగ్యకరమైన ఆహారం తీసుకుంటూ జీవితాంతం జీవించవచ్చని తెలిపారు. 2030 నాటికి హెచ్‌ఐవి లేని సమాజస్థాపనే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రజలందరికీ సరియైన అవగాహన కల్పించి సమాజ ఆరోగ్యానికి పాటుపడదామని తెలిపారు. హెచ్‌ఐవి పాజిటివ్ వ్యక్తులను ఎగతాళి చేసి మాట్లాడిన వైలేషన్ ఆఫ్ రూల్ సెక్షన్ 4 క్రింద లక్ష రూపాయల వరకు జరిమానా, జైలు శిక్ష విధించబడున్నారు. హెచ్‌ఐవి పాజిటివ్ ఉన్న అందరికీ ఏఆర్‌టి సెంటర్ ద్వారా మందులు ఇవ్వడం జరుగుతుందన్నారు. జిల్లాలోని 1,600 మంది హెచ్‌ఐవి పాజిటివ్ ఉన్న వారికి ప్రతి నెల రూ.4వేలు పెన్షన్ అందిస్తున్నామన్నారు. డిఐఓ హనుమంతరావు మాట్లాడుతూ హెచ్‌ఐవి వ్యాధిగ్రస్తుల ఇన్సిడెంట్ రేట్ ప్రస్తుతం 0.07 ఉందని 2003 నాటికి పూర్తిగా నిర్మూలిద్దామని తెలిపారు. సమిష్టి కృషి అవగాహనతో 2030 నాటికి కొత్త కేసులు లేని సమాజ నిర్మాణమే అందరి ధ్యేయంగా పనిచేద్దామన్నారు. కార్యక్రమంలో జెడ్‌పి సీఈఓ రవికుమార్ నాయుడు, డిపిఓ సుధాకర్ రావు, జిల్లా డిప్యూటీ డైరెక్టర్ సోషల్ వెల్ఫేర్ రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డిఎం అండ్ హెచ్‌ఒ డాక్టర్ ప్రభావతిదేవి

వర్షంలోనూ పెన్షన్ పంపిణీ

95 శాతం పింఛన్ల పంపిణీ



ప్రజాశక్తి- కుప్పం రూరల్: రాష్ట్రవ్యాప్తంగా ఒక్కరోజు ముందుగానే పెన్షన్ల పండుగ ప్రారంభమైందని ఏపీఎస్ ఆర్టీసీ ఉపాధ్యక్షులు పిఎస్.మునిరత్నం తెలిపారు. శనివారం ఆయన కుప్పం మండలం, కంగుంది గ్రామంలో పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలోని లబ్ధిదారుల ఇండ్ల వద్దకు వెళ్లి స్వయంగా పెన్షన్ డబ్బులను అందజేశారు. పంచాయతీ పార్టీ అధ్యక్షులు షరీఫ్, స్కూల్ కమిటీ చైర్మన్ రాజేంద్ర, వెంకటేష్, వైస్‌సర్పంచ్ తిరుపతి, రమేష్, ప్రసాద్, మున్ఆఫ్, గణేష్ పాల్గొన్నారు.

కార్వేటినగరం: జీడి నెల్లూరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ డాక్టర్ విఎం.థామస్ సూచనల మేరకు ఎన్టీఆర్ పెన్షన్ భరోసా పించన్లు ఒకరోజు ముందుగానే వర్షం పడుతున్న ఇంటికి వచ్చి ఇవ్వడం పట్ల వృద్ధులు, వికలాంగులు హర్షం వ్యక్తం చేశారు. ఈవో నాగరత్నమ్మ, సచివాలయం సిబ్బంది జనార్ధన్, తేజ, టిడిపి నాయకులు యూనిట్ ఇంచార్జ్ మేళం రవి యాదవ్, బూత్ కన్వీనర్ జగన్నాథం, కే.సందాని పాల్గొన్నారు. అదేవిధంగా ఆర్కేవిబి పేటలో సచివాలయం సిబ్బంది, టిడిపి నాయకులు నాగభూషణం రెడ్డి, చంగల్‌రాయలు పింఛన్లు పంపిణీ చేశారు.

బంగారుపాళ్యం: వృద్ధాప్య, వితంతు, వికలాంగుల పింఛన్లను 95శాతం పంపిణీ చేసినట్టు ఇంచార్జ్ ఎంపీడీవో శ్రీధర్ తెలిపారు. డిసెంబర్ నెల పింఛన్‌ను ఒకరోజు ముందుగానే నవంబర్ 30వ తేదీన పంపిణీ చేపట్టినట్టు 95శాతం పూర్తి అయ్యిందని, ఐదు శాతం మిగిలి వారికి సోమవారం పంపిణీ చేపట్టనున్నట్టు తెలిపారు.

విజయపురం: మండలంలో మొత్తం 5082 పింఛన్లు కాగా 4707 పింఛన్లను పంపిణీ చేసినట్టు ఎంపీడీవో రమణప్రకాష్ తెలిపారు. ఎడతెరపి లేకుండా వర్షం, ఈదురు గాలులు వీస్తున్న పింఛన్లను సచివాలయ సిబ్బంది తమవంతు కృషి చేసి 92.62 శాతం మందికి పింఛను పంపిణీ చేశామన్నారు. మిగిలిన వారికి సోమవారం పంపిణీ చేస్తామన్నారు.

కోర్టు సిబ్బందికి ఉచిత వైద్య పరీక్షలు



వైద్యపరీక్షలు చేయించుకుంటున్న జిల్లా న్యాయమూర్తి భీమారావు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

ఆరోగ్యమే మహాభాగ్యమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఇ.భీమారావు పేర్కొన్నారు. శనివారం జిల్లా న్యాయసేవ అధికారసంస్థ ఇంచార్జి కార్యదర్శి, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎంవిఎన్.పద్మజ, 1వ అదనపు జిల్లా జడ్జి ఎస్.రమేష్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు రాజేంద్రనాథ్ రెడ్డి జిల్లా కోర్టులో జిల్లా న్యాయసేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో కోర్టు సిబ్బందికి ప్రైవేట్ విన్ హెల్త్ ఆసుపత్రి ద్వారా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కోర్టు సిబ్బంది, న్యాయవాదులు ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నారని తెలిపారు. జిల్లా పోక్స్ కోర్టు జిల్లా జడ్జి ఎన్.శాంతి, అదనపు సివిల్ జడ్జి ఎస్‌పి డి.వెన్నెలా, 3వ అదనపు సివిల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసులు, డాక్టర్ శ్రీవాణి, డాక్టర్ నవీన్, డాక్టర్ రమేష్, సీనియర్, జూనియర్ న్యాయధికారులు, కోర్టు సిబ్బంది విన్‌హెల్త్ ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

నేడు హెచ్‌ఐవి అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

డిసెంబర్ 1వ తేదీ ఆదివారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ఉదయం 9 గంటలకు చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రి నుంచి గాంధీజీ విగ్రహం వరకు నర్సింగ్ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించబడునని, ర్యాలీ అనంతరం జడ్పీ మీటింగ్ హాల్‌లో హెచ్‌ఐవి ఎయిడ్స్ పై అవగాహన మీటింగ్ నిర్వహించబడునని ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ప్రజాప్రతినిధులు లైన్ డిపార్ట్మెంట్ అధికారులు అందరూ పాల్గొననున్నారని జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ప్రభావతి దేవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-ఎస్ఆర్ పురం: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఆర్ పురం ప్రభుత్వ వైద్య అధికారి గిరి తెలిపారు. స్థానిక ఆరోగ్య కేంద్రంలో మీడియా సమావేశంలో డాక్టర్ గిరి మాట్లాడుతూ... ప్రస్తుతం ఫెంగల్ తుఫాన్ ప్రభావం జోరుగా వర్షం కురుస్తున్న నేపథ్యంలో పరిసరాల్లో నీటి నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. గ్రామాల్లో అంటువ్యాధులు వ్యాప్తి చెందకుండా ముందస్తుగా తగు జాగ్రత్తలు చేపట్టాలన్నారు. ఆసుపత్రిలోని వైద్య సిబ్బందికి పలు సూచనలిచ్చారు. అలాగే జ్వరాలు అతి సారా వంటివి ఎక్కువగా ఉన్నట్లయితే ప్రభుత్వ వైద్యానికి సమాచారం ఇవ్వాలని కోరారు.

ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం ఎంపిక



ఎన్నికైన నూతన కార్యవర్గం

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: నూతన ప్రెస్‌క్లబ్ కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్టు గౌరవ అధ్యక్షులు ప్రతాప్‌సేన్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని జర్నలిస్టుల సమావేశం జరిగింది. బంగారుపాలెం ప్రెస్‌క్లబ్ అధ్యక్షులుగా అరవింద్ బాబు (ఆంధ్రజ్యోతి) ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా ప్రతాప్సేన్ (ఆంధ్రభూమి), ప్రధాన కార్యదర్శిగా శివశంకర్(సాక్షి), కోశాధికారిగా శంకరన్(ప్రజాశక్తి), ఉపాధ్యక్షులుగా రామచంద్ర (ఈనాడు), ఉమాపతి (వార్త), సంయుక్త కార్యదర్శిగా చాంద్ బాషా (విశాలాంధ్ర), బాలయ్య (మనం), జ్యోతినాథ్ (ఆంధ్రప్రభ) ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికైన అధ్యక్షులు అరవింద్ బాబు మాట్లాడుతూ ఉమ్మడిగా ప్రెస్‌క్లబ్‌ను నిర్వహించడం మంచి సంప్రదాయమని జర్నలిస్టు సమస్యలతో పోరాడేందుకు కార్యవర్గం పనిచేస్తుందన్నారు. కార్యవర్గం ఎలాంటి అవకతవకలకు పాల్పడకుండా నడుచుకోవాలని అప్పుడే మన జర్నలిజంకు నిజమైన జర్నలిజం ప్రజలకు అందించిన వారమవుతామన్నారు.

మద్యం తాగి వాహనాలు నడపొద్దు..

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: మద్యం సేవించి వాహనాలు నడపరాదని సీఐ శ్రీనివాసులు అన్నారు. శనివారం మద్యం సేవించి వాహనాల నడుపుతున్న ఆరు మందిపై కేసు నమోదు చేసినట్టు వెల్లడించారు. బహిరంగ ప్రదేశంలో మద్యం సేవిస్తున్న ఏడు మందిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచినట్లు చెప్పారు. వీరికి చిత్తూర్ ప్రిన్సిపల్ జూనియర సివిల్ జడ్జి ఉమాదేవి ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున జరిమానా విధించగా, బహిరంగ ప్రదేశాల్లో మద్యం చేస్తున్న వారికి 1000 రూపాయలు జరిమానా విధించారని వివరించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి-ఐరాల: కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ఆలయ 2025 నూతన క్యాలెండర్‌ను పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ మురళీమోహన్ ఆవిష్కరించారు. శనివారం చిత్తూరు లక్ష్మీనగర్ కాలనీలోని ఆయన కార్యాలయంలో ఎమ్మెల్యే చేతుల మీదుగా ఆవిష్కరించారు. దేవస్థానం చరిత్ర, ప్రాధాన్యత, భక్తుల సేవలకు అంకితభావంతో రూపొందించిన ఈ క్యాలెండర్‌లో పండుగలు, విశేష తేదీలతో పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాల వివరాలు పొందు పరచబడి ఉందని ఈవో గురుప్రసాద్ ఎమ్మెల్యేకి వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గిరిధర్ బాబు, హరిబాబు నాయుడు, మధుసూదన్ రావు, హేమాద్రి నాయుడు, చంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

'రోడ్డు బాగు చేయించండి'

ప్రజాశక్తి-పలమనేరు: గంగవరం పంచాయతీ పరిధిలో మూడు కిలోమీటర్ల మేర రోడ్డు గుంతల మయంగా మారి ఇబ్బందికరంగా ఉందని గంగవరం పంచాయతీ వాసులు శనివారం ఎమ్మెల్యే అమరనాథ రెడ్డికి విన్నవించారు. పలమనేరు ఎమ్మెల్యే కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. గంగవరం పంచాయతీ పరిధిలోని కూర్నిపల్లి, కొత్త ఇండ్లు చీళ్ల వారిపల్లి, వి.రామాపురం, తమ్మిరెడ్డిపల్లి గ్రామాలకు వెళ్లే దారి అధ్వాన స్థితికి చేరుకుందని వివరించారు. రోడ్డుకు మరమ్మతులు చేయించాలని ఎమ్మెల్యేని కోరారు. మండల వాసులు ప్రసాద్ నాయుడు, మురళి, ఆనంద, విజయ్ కుమార్ త్రిమూర్తి, చంద్రయ్య, పాండు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

చైన్ స్నాచర్స్.. పుంగనూరులో కొత్త ఫీచర్స్..



- నమ్మించి ఆపై చైన్‌లు లాక్కెళుతున్న దుండగులు
- ఒంటరి ఇండ్లు, వ్యవసాయ పొలాల వద్ద తెగబడుతున్న వైనం
- భయాందోళనకు గురవుతున్న మహిళలు

ప్రజాశక్తి-పుంగనూరు: పుంగనూరు పరిసర ప్రాంతాల్లో గొలుసు దొంగలు విజృంభిస్తున్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంత మహిళలు భయాందోళనలు చెందుతున్నారు. ఇటీవల కాలంలో ఎక్కడబడితే అక్కడ బంగారు గొలుసులు చోరీలు ఎక్కువగా జరుగుతున్నాయి. ద్విచక్ర వాహనంలో వస్తూ మెడలో ఉన్న బొట్టు చైన్లు లాక్కెళ్ళడం, ఇండ్ల దగ్గర ఉన్న మహిళలకు ఏదో పని పైన వచ్చినట్లు వారితో మాట్లాడుతూ లాక్కెళ్ళడం విస్తృతంగా జరుగుతున్నాయి. గొలుసు దొంగలు రెచ్చిపోతున్నారు. ఒంటరిగా వెళుతున్న మహిళలను ఇప్పటిదాకా టార్గెట్ చేసిన చైన్ స్నాచర్స్ ఇప్పుడు ఏకంగా మహిళల ఇంట్లోకి చొరబడుతున్నారు. భయంలేకుండా బరితెగిస్తూ మహిళలు మెడలో నుంచి బంగారు గొలుసులు లాక్కెళుతున్నారు. వరుస చైన్ స్నాచింగ్ ఘటనలతో మహిళలు బెంబేలెత్తిపోతున్నారు. బయటకు రావాలంటేనే మహిళలు భయపడిపోతున్నారు. గత మూడు నెలలుగా ఎక్కడబడితే అక్కడ ఎప్పుడు బడితేఅప్పుడు చైన్ స్నాచర్స్ దోపిడీలకు పాల్పడుతున్నారు.

➤➤ నవంబర్ 2న పురుషోత్తం రాజు భార్య కమలమ్మ కోర్టు బైపాస్ రోడ్‌లో వెళుండగా ఆమె మెడలో నుండి 30 గ్రాములు బంగారు చైన్ లాక్కెళ్ళాడు. స్థానికులు దీనిని గమనించి అగంతుకున్ని పట్టుకున్నారు. ఇతన్ని పోలీసులు విచారించగా పుంగనూరు మండలం లక్ష్మీ నాయక్ తాండకు చెందిన ప్రసాద్‌గా గుర్తించారు. ఇతను పుంగనూరు ఏపీఎస్ఆర్టీసీ డిపోలో ఔట్సోర్సింగ్ ఎంప్లాయ్‌గా పని చేస్తున్నాడు. ఆన్లైన్ బెట్టింగ్ ద్వారా లక్షల రూపాయలు పోగొట్టడంతో చేసిన అప్పులు తీర్చుకోవాలని ఇలా చైన్ స్నాచింగ్‌కు పాల్పడుతున్నట్లు దర్యాప్తులో తేలినట్లు పోలీసులు తెలిపారు.

➤➤ మండలంలోని సింగిరిగుంట గ్రామానికి చెందిన పార్వతమ్మ పుంగనూరు సింగిరిగుంట మార్గమధ్యంలో వ్యవసాయ పొలంలో పనులు చేస్తుండగా నవంబర్ 14న మెడలో ఉన్న బొట్టు చేను లాక్కెళ్ళారు. అలాగే పట్టణంలోని కొత్తపేటకు చెందిన రాజారెడ్డి భార్య భారతిని ఓ మహిళ ఉదయం ఆకలిగా ఉన్నది టిఫిన్ పెట్టాలని అడగగా ఆమెను ఇంటిలోకి పిలిచి టిఫిన్ పెట్టడం జరిగింది. టిఫిన్ తిన్న తర్వాత ఆ మహిళ భారతీపై దాడి చేసి గాయ పరిచి ఆమె మెడలో ఉన్న బంగారు చైన్ లాక్కెళ్లాలని ప్రయత్నించింది. ఆ మహిళ దీన్ని గమనించి కేకలు వేయడంతో చుట్టుపక్కల ఉన్న మహిళలు వచ్చి ఆమెను పట్టుకొని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. గత మూడు నెలలుగా పదుల సంఖ్యలో చైన్ స్నాచింగ్ జరిగాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీనిపై పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి చైన్ స్నాచింగ్ ముఠాకు అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని పుంగనూరు పట్టణ వాసులు కోరుతున్నారు.



స్థానికులకు పట్టుబడ్డ మహిళ (ఫైల్)

రిటైర్డ్ పోలీసుల సంక్షేమానికి సహకారం అందించండి

- ఐజి చారుసిన్హాను విన్నవించిన రిటైర్డ్ ఎస్పీ చిన్నస్వామి

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: రిటైర్డ్ పోలీసుల సంక్షేమానికి సహకారం అందించాలని ఏపీ రాష్ట్ర రిటైర్డ్ పోలీసుల సంఘం అధ్యక్షుడు, రిటైర్డ్ ఎస్పీ పి చిన్నస్వామి కోరారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో శనివారం ఐజి చారుసిన్హా, డిఐజీలు ప్రవీణ్, ఎస్ఎన్ మిశ్రాలకు రిటైర్డ్ పోలీసుల సమస్యలపై వేరువేరుగా వినతిపత్రాలను ఏపీ, తెలంగాణ రాష్ట్రాల రిటైర్డ్ పోలీసుల యూనియన్ల తరపున అందజేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రం రిటైర్డ్ పోలీసుల కార్పొరేషన్, వెల్ఫేర్ బోర్డు, క్యాంటీన్ ఏర్పాటుచేసి చేయూత అందివ్వాలని విన్నవించామన్నారు. దీనిపై సీఎంతో పాటు డీజీపీలతో తెలియజేసి సమస్యల పరిష్కారాన్ని కృషి చేస్తామని హామీ ఇచ్చారని చెప్పారు. కార్యక్రమంలో




ఐజి చారుసిన్హాకు పూల బొకే అందిస్తున్న చిన్నస్వామి

ఏపీ రిటైర్డ్ పోలీసుల యూనియన్ ఉపాధ్యక్షులు రాజేష్, ఏడుకొండలు బాలసుబ్రమణ్యం, జనరల్ సెక్రెటరీ హరినాథ్, జాయింట్ సెక్రటరీలు అప్పారావు సుబ్రహ్మణ్యం, ట్రెజరర్ శ్రీనివాసులు, తెలంగాణ రాష్ట్ర రిటైర్డ్ పోలీసుల సంక్షేమ సంఘం అధ్యక్షులు శ్యామ్ సుందర్ రెడ్డి, ఆ యూనియన్ అడ్వైజర్ ఎస్ఎన్ రెడ్డి పాల్గొన్నారు.

ఎంఈవో శ్రీరాములు దంపతులకు సన్మానం

ప్రజాశక్తి-సదుం: సదుం, సోమల మండల విద్యాధికారి ఎంఈవో శ్రీరాములు శనివారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా సదుం, సోమల మండల పరిధిలోని ఉపాధ్యాయులు, ఆయన బంధువులు, స్నేహితులు, అభిమానులు ఆయనను, ఆయన సతీమణి రెడ్డెమ్మను శాలువాలతో, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన విద్యాపరంగా చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో చౌడేపల్లి ఎంఈవో కేశవరెడ్డి, పులిచెర్ల ఎంఈవో



ఎంఈవో దంపతులను సన్మానిస్తున్న పలువురు

సిద్ధరామయ్య, సదుం జెడ్పీ ఉన్నత పాఠశాలల హెచ్ఎం జయకుమార్ రెడ్డి, సందీప్ రెడ్డి, సుమతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కథలు వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుతాయి



- పి తులసినాథం నాయుడు

ప్రజాశక్తి-పలమనేరు: కథలు వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుతాయని తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షుడు పి తులసి నాథం నాయుడు పేర్కొన్నారు. శనివారం స్థానిక గురుకుల బాలికల పాఠశాలలో డాక్టర్ హరికిషన్ రచించిన 'చిలకముక్క చిన్నోడు' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ పిల్లల్లో కథలు చదివే అలవాటును ప్రోత్సహించాలన్నారు. ముఖ్య అతిధిగా విచ్చేసిన సిఐ భాస్కర్ మాట్లాడుతూ చిన్నతనంలో కథలు, పద్యాలు నేర్చుకుంటే పెద్దయ్యాక విలువలతో కూడిన జీవితం గడుపుతారన్నారు. మరో అతిథి పలమనేరు బాలాజీ మాట్లాడుతూ డాక్టర్ హరికిషన్ తన 75వ పుస్తకంను తులసినాధం నాయుడుకు అంకితం ఇవ్వడం చాలా గొప్ప విషయమన్నారు. నిరంతరం చదివే అలవాటు ఉన్నవారు ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారన్నారు. రచయిత హరికిషన్ మాట్లాడుతూ తెలుగు భాషకు నిరంతరం సేవ చేస్తున్న తులసి నాధం నాయుడుకు తన 'చిలకముక్కు చిన్నాడు' పుస్తకాన్ని అంకితం ఇవ్వడం తనకు గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా రచయితను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో శ్రీరామ చంద్రమూర్తి, మాధవరెడ్డి. ఆనందబాబు, వేణుగోపాల్ రెడ్డి, ప్రిన్సిపాల్ ప్రశాంతి, సంస్థ కార్యదర్శి పుష్ప, శ్రీనివాసులు, కన్నయ్య నాయుడు, ధనంజయ, తాతయ్య తదితరులు పాల్గొన్నారు.

కుప్పం అభివృద్ధే ధ్యేయం

- ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్



రింగ్ రోడ్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ

ప్రజాశక్తి-కుప్పం టౌన్: కుప్పం నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే ధ్యేయం అని ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ తెలిపారు. శనివారం ఆయన కుప్పం పట్టణం చుట్టు ప్రక్కల ఉన్న రింగ్ రోడ్డును పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కుప్పం నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని సీఎం హామీ ఇచ్చారన్నారు. ఆయన ఆదేశాల మేరకు రింగ్ రోడ్డును పరిశీలించడం జరిగిందన్నారు. త్వరలో రోడ్డు పనులు పూర్తి చేసి నియోజకవర్గాన్ని సమగ్రంగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కుప్పం నియోజకవర్గ పరిశీలకులు నరేష్, పట్టణ అధ్యక్షుడు రాజకుమార్, మున్సిపాలిటీ ఫ్లోర్ లీడర్ జిమ్ దాము, సత్యేంద్ర శేఖర్, కాణిపాకం వెంకటేష్, జయరామ్ నాయుడు పాల్గొన్నారు.

చోరీలకు చెక్ పెట్టేందుకే స్మార్ట్ లాక్లు

- కుప్పం రూరల్ సీఐ మల్లేష్ యాదవ్



స్మార్ట్ లాక్‌లు చూపుతున్న సీఐ మల్లేష్ యాదవ్

ప్రజాశక్తి-రామకుప్పం: చోరీలకు సాధ్యమైనంత చెక్ పెట్టేందుకు ప్రతి ఒక్కరు స్మార్ట్ లాక్లు వినియోగించుకోవాలని కుప్పం రూరల్ సీఐ మల్లేష్ యాదవ్, రామకుప్పం ఎస్ఐ వెంకట మోహన్‌లు కోరారు. శనివారం రామకుప్పంలో వారు విలేకరులతో మాట్లాడుతూ.. మండలంలోని పలు దేవాలయాలు, ప్రార్థన మందిరాలకు దాతల సహకారంతో తాము స్మార్ట్ లాక్లను చేస్తున్నామని వారు తెలిపారు. ప్రజలు కూడా తమ నివాస గృహాలు, గోదాములకు స్మార్ట్ లాక్కులను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అదే విధంగా దుకాణదారులు సిసి కెమెరాలు కూడా ఏర్పాటు చేసుకోవాలన్నారు. గ్రామాల్లో అపరిచిత వ్యక్తుల సంచారం జరుగుతుంటే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని వారు కోరారు. గ్రామాల్లో నాటు సారా తయారీ, విక్రయాలు, గంజాయి విక్రయాలకు పాల్పడరాదన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించినా, అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా సహించేది లేదనీ, కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా వారు హెచ్చరించారు.

రాష్ట్ర బీసీ ఫ్రంట్ ఉపాధ్యక్షులుగా వెంకటరమణ



వెంకటరమణ

ప్రజాశక్తి-పెద్దపంజాణి: రాష్ట్ర బీసీ ఫ్రంట్ ఉపాధ్యక్షు లుగా మండలంలోని బొమ్మల కుంట గ్రామానికి చెందిన గెడిదేసి వెంకటరమణను రాష్ట్ర అధ్యక్షులు అద్దంకి రమణమూర్తి నియమించినట్లు ఆయన శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అమరావతి లోని ఉండవల్లి బిసి కార్యాలయంలో రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన బీసీలకు చేసిన సేవలకు గుర్తుగా నియామక పత్రం అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిసి ఉప కులాలకు ఏ సమస్య వచ్చినా సకాలంలో స్పందించి వారికి సత్వర న్యాయం చేస్తానని బీసీల అభివృద్ధికి కృషి చేస్తానని, రాష్ట్రంలో బీసీ జనాభా ప్రాతిపదికన రాజకీయ, విద్యలో మొదలుగు రంగాల్లో బీసీలకు సముచిత స్థానం కోసం కృషి చేస్తానని అన్నారు.

మహిళా సమస్యల పరిష్కారమే ఐద్వా లక్ష్యం

- ఐద్వా జిల్లా కార్యదర్శి భువనేశ్వరి

ప్రజాశక్తి-వి కోట: సమాజంలో మహిళల హక్కుల పరిరక్షణ వారు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారమే లక్ష్యంగా ఐద్వా ముందుకెళ్తోందని చిత్తూరు జిల్లా ఐద్వా కార్యదర్శి భువనేశ్వరి తెలిపారు. మండల కేంద్రమైన వి కోటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ఐద్వా ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం దేశవ్యాప్తంగా మహిళలపై జరుగుతున్న దాడులు అత్యాచారాలు నివారించడంతోపాటు వారి హక్కుల పరిరక్షణకు విశేషంగా పోరాడుతోందన్నారు. మహిళలు చైతన్యవంతులైనప్పుడే వారు అన్ని రంగాల్లో రాణించగలుగుతారని తెలిపారు. ఆడపిల్లలకు విద్య ఉద్యోగ అవకాశాలు అందుబాటులో లేనప్పుడు సమానత్వం అసాధ్యమన్నారు. మహిళలకు సామాజికంగా రాజకీయంగా ఆర్థికంగా పురుషులతో సమానంగా అవకాశాలు కల్పించినప్పుడే అణిచివేతలు అంతమవుతాయని



ఎన్నో పోరాటాల ఫలితంగా మన భారత రాజ్యాంగం మహిళలకు అనేక హక్కులు కల్పించిందని ప్రతి మహిళ గుర్తించాలన్నారు. దేశంలో బిజెపి అధికారం చేపట్టిన తర్వాత నిరుద్యోగం నిరక్షరాస్యత పేదరికం పెరిగిందన్నది గణాంకాలు తెలుపుతున్నాయన్నారు. భేటీ బచ్చావో బేటి పడావో అన్నమాట నినాదంగానే మిగిలి పోయింది అని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో మద్యం, మత్తు పదార్థాలు నియంత్రించాలని, అత్యాచార నిధులను ఫాస్ట్ ట్రాక్కోట్ల ద్వారా విచారణ జరిపి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ ఉపాధ్యాయురాలు నిర్మల, ఓబుల్ రాజు, శ్యామల, అనిత, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్స్‌కు అండగా ఉంటాం..

- అసోసియేషన్ ఉపాధ్యక్షులు శరత్

ప్రజాశక్తి-కుప్పం రూరల్: కుప్పం ఫొటోగ్రాఫర్, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ సభ్యులకు అండగా ఉంటామని ఉపాధ్యక్షులు శరత్ తెలిపారు. శనివారం వారు కుప్పం మండలం రాములగుట చేను గ్రామానికి చెందిన సురేష్‌ను కలిసి పరామర్శించారు. రూ.15వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ తమ అసోసియేషన్ సభ్యుడు సురేష్ తండ్రి సోమప్ప శుక్రవారం మరణించడం జరిగిందన్నారు. సురేష్ మూగ, చెవిటి వాడైనా ఒక ఫొటో స్టూడియోలో బాయ్‌గా పనిచేస్తూ, స్వశక్తితో తన కుటుంబాన్ని పోషిస్తున్నట్టు తెలిపారు. అటువంటి యువకుడికి



ఆర్థిక సాయం అందిస్తున్న అసోసియేషన్ సభ్యులు

అండగా నిలుస్తూ అసోసియేషన్ సభ్యుల సహకారంతో ఆర్థిక సహాయం అందజేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ సభ్యులు శరవణ, గురు, యుగేందర్, మనోహర్, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు స్వయం కృషితో అభివృద్ధి చెందాలి

- టీడీపీ మండల అధ్యక్షులు ఆనంద్ రెడ్డి

ప్రజాశక్తి-రామకుప్పం: స్వయం సహకార సంఘాల్లోని మహిళలు గ్రామాల్లో చౌక దుకాణాలు ఏర్పాటు చేసుకొని స్వయం కృషితో ఆర్థిక అభివృద్ధి చెందాలని టిడిపి మండల అధ్యక్షులు ఆనంద రెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక స్త్రీశక్తి భవనంలో వివో లీడర్లు, సంఘ మహిళలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన పథకాలతో గ్రామాల్లో చిన్నచిన్న దుకాణాలు ఏర్పాటు చేసుకొని బ్యాంకుల ద్వారా రుణాలు పొందాలన్నారు. చిన్న చిన్న పరిశ్రమలు ఏర్పాటు చేసుకొని ఆన్లైన్ మార్కెటింగ్ కూడా ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. కర్ణాటక రాష్ట్రం బెంగళూరులోని ఈజీ మార్కెటింగ్ ప్రతినిధుల ద్వారా ఏవిధంగా మార్కెటింగ్ చేసుకోవచ్చు అని



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆనంద రెడ్డి

అవగాహన కల్పిస్తామన్నారు. వెలుగు ద్వారా ఈ మార్కెటింగ్ పూర్తిస్థాయిలో అవగాహన కల్పించి ఆర్థిక అభివృద్ధికి లక్ష రూపాయల వరకు బ్యాంకు రుణాలు పొందవచ్చు అన్నారు. కార్యక్రమంలో టీడిపి మండల కార్యదర్శి నరసింహులు, బిజెపి జిల్లా నేత రాజసింహ, జనసేన మండల అధ్యక్షులు హరీష్, ఏపీవో శ్రీనివాసమూర్తి, మురళి, వెలుగు సిసిలు, మహిళలు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన అవసరం

ప్రజాశక్తి-కుప్పం టౌన్: నేటి సమాజంలో ప్రతి ఒక్కరూ ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలని పిఈఎస్ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ హెచ్ఆర్ కృష్ణారావు తెలిపారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని కుప్పం ఇంజనీరింగ్ కళాశాల, పిఈఎస్ వైద్య కళాశాల విద్యార్థినులకు కోర్ కమిటీ సభ్యులు రంగోలి పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన వైద్య కళాశాల విద్యార్థినిలు వేసిన ముగ్గులను పరిశీలించి, విజేతలను ఎంపిక చేశారు. ఈ పోటీలలో గెలుపొందిన వారికి ఆదివారం నాడు ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవ సందర్భంగా బహుమానాలను అందివ్వనున్నారు. కార్యక్రమంలో కోర్ ప్రాజెక్ట్ మేనేజర్ సుమలత, ప్రవీణ, కామాక్షి, కమలదీవెన, శివరంజని, దినేష్, మెడికల్ కాలేజి సిబ్బంది పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లి: మండలంలోని తీర్థం గ్రామ పరిధిలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం ప్రపంచ ఎయిడ్స్ దినం సందర్భంగా డాక్టర్ పద్మావతి, హెచ్ఎం రత్నమ్మ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎస్ శ్రీదేవి, రాజారెడ్డి, ఎంఎల్‌హెచ్‌పి ఎస్ పూర్ణ, బేబి, ఉపాధ్యాయులు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.


సోమల: ఎయిడ్స్ వ్యాధి నివారణ కోసం ప్రతి ఒక్కరూ ఎయిడ్స్ వ్యాధి పట్ల అవగాహన కలిగి ఉండాలని తద్వారా ఎయిడ్స్ వ్యాధి వ్యాప్తి నిరోధించి ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించేందుకు అవకాశం ఏర్పడుతుందని పెద్ద ఉప్పరపల్లి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి బాలాజీ అన్నారు. డిసెంబర్ ఒకటవ తేదీ ప్రపంచ ఎయిడ్స్ వ్యాధి దినోత్సవం సందర్భంగా ముందస్తు అవగాహన ర్యాలీ కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.



చౌడేపల్లిలో

చౌడేపల్లి: ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హెచ్ఐవి ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారి పవన్ కుమార్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

'మంగళ విద్యావాణి' సంచిక ఆవిష్కరణ



ప్రజాశక్తి-బంగారుపాళ్యం: విద్యార్థులకు సులభతరంగా అర్థమయ్యేందుకు 'మంగళ విద్యావాణి' సంచిక ఎంతో ఉపయోగపడుతున్నదని ప్రధానోపాధ్యాయులు రాజ్యలక్ష్మి అన్నారు. శనివారం మండలంలోని మంగళపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 'మంగళ విద్యావాణి' 31వ సంచిక ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ మంగళపల్లి పాఠశాలలో విద్యార్థులచే నడపబడుతున్న పాఠశాల సంచిక 'మంగళ విద్యావాణి' సంచికకు దాతృత్వం వహించిన అమృత భారతి ఫౌండేషన్ వ్యవస్థాపకులు ప్రకాష్ రెడ్డి ప్రముఖ అవధాని ఆముదాల మురళి చేతుల మీదుగా ఘనంగా ఆవిష్కరించారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని తెచ్చిన ఈ ప్రత్యేక సంచికలో విద్యార్థులు తమ తోటి విద్యార్థుల వ్యక్తిత్వాలు, గుణగణాల గురించి అభిప్రాయాలను తెలుపుతూ వ్యాసాలు రాయడం జరిగింది. ఈ సందర్భంగా అవధాని ఆముదాల మురళి మాట్లాడుతూ పిల్లలు రాసిన వ్యాసాలన్నీ చక్కగా ఉన్నాయని ప్రశంసించారు. విద్యార్థులు సోమరితనం, వాయిదా వేయడం లాంటి అంతర్గత శత్రువులను జయించినప్పుడే గొప్ప విజయాలు అందుకోగలుగుతారని సందేశమిచ్చారు. దాత ప్రకాష్ రెడ్డి విద్యార్థులకు ప్రత్యేకంగా కెరీర్ గైడెన్స్ అంశంపై సూచనలు ఇచ్చి భవిష్యత్‌లో చదువు కోర్స్‌ల గురించి మార్గ నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా పిల్లల కోరిక మేరకు ముందుగా వారు అడిగిన వివిధ పుస్తకాలు తన సొంత నిధులతో కొని విద్యార్థులకు ఉచితంగా అందించారు. పుస్తక పఠనం సంపూర్ణ జ్ఞానాన్నిస్తుందని వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాఠశాల గణిత ఉపాధ్యాయులు, అవధాని అరుణ శివప్రసాద్, ఉపాధ్యాయులు రమాదేవి, సంజీవి, పిల్లారప్ప, సంపంగి, శ్రీనివాసులు, ధన శేఖర్, మోహన్ రెడ్డి, భారతిలు పాల్గొన్నారు.

ప్రజల సొమ్ము దుర్వినియోగానికి పాల్పడతారా!

- ఉన్న ట్రాక్టర్లు, ట్రాలీలు ఏమయ్యాయి?
- నెలకు ట్రాక్టర్ లీజు 90 వేలా?
- అధికారులు నిలదీసిన కౌన్సిల్ సభ్యులు

ప్రజాశక్తి-పుంగనూరు: ప్రజల సొమ్మును విచ్చలవిడిగా ఖర్చుపెట్టి దుర్వినియోగానికి పాల్పడితే అడిగే వాళ్ళు ఎవరూ లేరని అనుకుంటున్నారా అంటూ 8వ వార్డు కౌన్సిలర్ రామకృష్ణంరాజు అధికారులను నిలదీశారు. పుంగనూరు మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సర్వసభ్య సమావేశం శనివారం కౌన్సిల్ హాల్లో ఛైర్మన్ హలీం బాషా అధ్యక్షతన జరిగింది. సమావేశంలో రామకృష్ణమ రాజు మాట్లాడుతూ చెత్తను ట్రాక్టర్లో తీసుకువెళ్లేందుకు ఒక నెలకు లీజు అమౌంట్ 90వేల రూపాయల అంటూ ప్రశ్నించారు. మున్సిపాలిటీకి ఉన్న ట్రాక్టర్లు, ట్రాలీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ఒక్క మోటర్ రిపేరు చేయాలంటే 35వేలు లెక్కలు చూపిస్తున్నారే కొత్త మోటర్ కొనాలంటే 70వేల రూపాయలు మాత్రమే కదా ప్రజల సొమ్మును ఇలా దుర్వినియోగం చేస్తే ఎలా అని సమావేశంలో అధికారులు నిలదీశారు. దీనిపై కమిషనర్ మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్మన్

పారిశుధ్యం కోసం ఉన్న ట్రాక్టర్లు, ట్రాలీలు మరమ్మతులు గురి అయిన వాటిని మరమ్మతులు చేపడుతున్నట్లు చెప్పారు. అప్పటివరకు చెత్తను తరలించేందుకు ఒక ట్రాక్టర్ ట్రాలీ డ్రైవర్‌తో కలిసి లీజుకు తీసుకుంటున్నట్లు అది కూడా టెండర్ ద్వారానే తీసుకుంటున్నట్టు చెప్పారు. కౌన్సిలర్ త్యాగరాజు మాట్లాడుతూ సీసీ కెమెరాలు, కంప్యూటర్లు, కొటేషన్లు పిలవడం జరిగిందని వాటి కొనుగోలులో నాణ్యతాపరమైనవి, వారంటీ ఉండేటివి కొనుగోలు చేయాలని చెప్పారు. గోకుల్ సర్కుల్లో ఉన్న శ్మశాన వాటికలో వర్షపు నీరుతో నిండిపోతుంది అని అక్కడ కట్టు కాలువ ఉన్నదని అది సర్వే చేసి దాన్ని గుర్తించి కట్టు కాలువ రెడీ చేస్తే వర్షపు నీరును అరికట్టేందుకు ప్రయత్నించవచ్చు అన్నారు. దీనిపై అధికారులు స్పందించి చర్య తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వీధి కుక్కలపై చర్య తీసుకోవాలని గతంలో కూడా చెప్పడం జరిగింది అని ఇప్పటికైనా అధికారులు స్పందించవలసిన అవసరం ఉందన్నారు. నక్కబండ ప్రాంతంలో నీటి సమస్య తీవ్రంగా ఉందని గతంలో కొన్నిసార్లు సమావేశంలో అధికారులు దృష్టికి తీసుకువచ్చిన సమస్య మాత్రం పరిష్కారం కాలేదని కౌన్సిలర్ మనోహర్ సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. ప్రోటోకాల్‌లో భాగంగా మున్సిపల్ సాధన సర్వసభ్య సమావేశంలో భాగంగా మున్సిపల్ కౌన్సిల్ హాలులో పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట పార్లమెంటు సభ్యులు పెద్దిరెడ్డి మిథున రెడ్డి ఫోటోలను ఏర్పాటు చేశారు.